వారాహి డిక్లరేషన్

నేటి సాయంత్రం తిరుపతిలో సభ


తిరుపతి, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): 'వారాహి డిక్లరేషన్'ను జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజలకు వివరించనున్నారు. దీనికోసం తిరుపతి నగరం బాలాజీ కాలనీలోని పూలేవిగ్రహం వద్ద గురువారం సాయంత్రం వారాహి సభ నిర్వహించనున్నారు. తిరుమలలో బుధవారం ప్రాయశ్చిత్త దీక్షను విరమించిన ఆయన.. సాయంత్రం 5 గంటలపైన తిరుమలనుంచి నేరుగా సభాస్థలికి చేరుకోనున్నారు. పవన్ సొంత ఖర్చులతో ఈ సభ నిర్వహిస్తున్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి వాడకం.. దీనిపై సుప్రీం కోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ ప్రసంగంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అలాగే, వారాహి డిక్లరేషన్‌లో ఏ అంశాలున్నాయనే దానిపైనా చర్చ సాగుతోంది. కాగా, పవన్‌కు ఉన్న ఇమేజ్ దృష్ట్యా జనసమీకరణపై జనసేన నేతలు దృష్టి పెట్టలేదు. రాయలసీమ జిల్లాలనుంచి పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యే అవకాశం ఉంది. కాగా, సభానంతరం పవన్ విజయవాడకు తిరుగుప్రయాణమవుతారు. సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎంపీ, బీజేపీ నేత వరప్రసాద్, జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజారెడ్డి తదితరులు పరిశీలించారు. వారాహి సభకు టీడీపీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఒక ప్రకటనలో కోరారు.



తిరుమల ఆలయం ముందు 'వారాహి డిక్లరేషన్' పుస్తకంతో పవన్

వారాహి సభకు భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం): పవన్ కల్యాణ్ నిర్వహించే వారాహి సభకు అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో ఇద్దరు డీఎస్పీలు, 5 మంది సీఐలు, మరో 420 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. పూలే విగ్రహం వద్ద సభ నేపథ్యంలో చిత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలను చెర్లోపల్లి బైపాస్ రోడ్డు, నాయుడుపేట-గూడూరు బైపాస్ రోడ్డు, మామిడి కాయల మండీ మీదుగా మళ్లించారు. గురువారం మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని డీఎస్పీ రామకృష్ణమాచ్చారి తెలిపారు. ఈ విషయంలో వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు.కమాండ్ కంట్రోలు రూము నుంచి పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని అదనపు ఎస్పీ చెప్పారు. దాదాపు 20 బైనాక్యులర్ కెమెరాలు వాడుతున్నారు.





నేడు అంకురార్పణ

రేపు ధ్వజారోహణం.. సీఎం పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల, ఆంధ్రజ్యోతి

బ్రహ్మోత్సవ సన్నాహాలు పూర్తయ్యాయి. నేడు అంకురార్పణతో సంబరాలు మొదలవుతాయి. రేపు ధ్వజారోహణం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంప్రదాయంగా స్వామికి పట్టు వస్త్రాలు అందజేస్తారు. రాత్రికి జరిగే పెద్ద శేషవాహన సేవతో మాడ వీధుల్లో దేవదేవుడి విహారం మొదలవుతుంది. 11వ తేదీ దాకా వివిధ వాహనాలపై ఊరేగింపు సాగుతుంది. 12న చక్రస్నానంతో నవరాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి. బ్రహ్మోత్సవాలు మొదలైన రెండో రోజు నుంచి మూడు రోజుల పాటు మధ్యాహ్నం ఒంటి గంటకు రంగనాయక మండపంలో స్నపనతిరుమంజన సేవ నిర్వహిస్తారు. వివిధ రకాల పూలు, పండ్లతో మండపాన్ని అలంకరిస్తారు. డ్రైఫ్రూట్స్‌తో చేసిన కిరీటాలు, మాలలు ఉత్సవమూర్తులకు అలంకరిస్తారు. బహ్మోత్సవాలలో గరుడసేవ అత్యంత విశిష్టమైనది. లక్ష్మీహారం, మకరకంఠి, పచ్చ, సహస్రనామావళి వంటి విశేషమైన ఆభరణాలను మలయప్పస్వామికి అలంకరించడం గరుడోత్సవ ప్రత్యేకత. ఎనిమిదవ రోజు రాత్రి అశ్వవాహనంతో వాహనసేవలు పరిసమాప్తమవుతాయి. తొమ్మిదవరోజు ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి.

> " బ్రహ్మోత్సవాల వేళ తిరుమల కొండ ఆహ్లాదకరమైన వాతావరణంతో భక్తులకు స్వాగతం పలుకుతోంది. అడపాదడపా కురుస్తున్న వానలతో కొండలన్నీ పచ్చబారి అందంగా ఉన్నాయి. రంగురంగుల పూలతో వనాలు కళకళలాడతున్నాయి. దీపతోరణాలు, దేవతామూర్తుల రూపాలు, ఫల పుష్ప, చిత్ర ప్రదర్శనాశాల... తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను ఆకట్టుకుంటోంది. "

ఘనంగా ఏర్పాట్లు

ఈ ఏడాది బ్రహ్మోత్సవ వేడుకల ఏర్పాట్లు ఘనంగా పటిష్ఠంగా జరుగుతున్నాయి. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి సారథ్యం వహిస్తున్నారు.

- ఆలయ మాడవీధుల్లో రంగవల్లులను తీర్చిదిద్దారు.
- మాడవీధుల్లో తాగునీటి కొళాయిలు, మరుగుదొడ్లను, గ్యాలరీలను ఆధునీకరించారు.
- గ్యాలరీల వద్ద తోపులాటలు లేకుండా పటిష్ఠమైన బ్యారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు.
- ఘాట్‌రోడ్లలో, తిరుమలలో రహదారులకు ఇరువైపులా గోడలకు రంగులు, ట్రాఫిక్ నిబంధనలు తెలిపే సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.
- తిరుమలతో పాటు అలిపిరి వద్ద అదనపు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు.
- ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ లైట్ల తోరణాలను రహదాల మధ్యలో, చెట్లకు, డివైడర్లకు శోభాయమానంగా అలంకరించారు. ప్రధాన కూడళ్లలో, రద్దీ ప్రాంతాలలో భారీ కటౌట్లను ఏర్పాటుచేశారు.
- పాపవినాశనం టోల్‌గేట్ వద్దనున్న కల్యాణవేదికలో పలపుష్ప, మ్యూజియం, ఫొటో, ఆయుర్వేదం, శిల్ప ప్రదర్శనశాలలను ముస్తాబు చేస్తున్నారు.
- శ్రీవారి ఆలయం, వెలుపల, ప్రధాన కూడళ్లలో పలు రకాలు పూలమొక్కలను ఏర్పాటు చేశారు.
- వాహనం ముందు ప్రదర్శనలు ఇచ్చేందుకు దాదాపు 15 రాష్ట్రాలకు చెందిన కళా బృందాలను ఆహ్వానించారు.

ఒకప్పుడు నెలకో బ్రహ్మోత్సవం


ఏడాదికోసారి దేవదేవుడు, దేవేరులతో కలిసి ఊరేగే వేడుకలే బ్రహ్మోత్సవాలు. తిరుమల ఊరు చిన్నదైనా.. దేశంలోని అనేక ప్రాంతాల నుంచీ వచ్చే భక్తులతో బ్రహ్మోత్సవ వాహన సేవలు అలనాడు కూడా కిటకిటలాడుతూనే ఉండేవి. శ్రీనివాసుడి ఉత్సవాలు కాలానుగుణంగా అనేక మార్పుచేర్పులకు లోనవుతూనే ఉన్నాయి. ఒకప్పుడు నెలకొకటి చొప్పున ప్రతిఏడాది పన్నెండు బ్రహ్మోత్సవాలు కూడా జరిగేవని చెబుతారు. కాలక్రమేణా మార్పులు జరిగి, ఏడాదిలో ఒకసారి పది నుంచి పన్నెండు రోజులు పాటు బ్రహ్మోత్సవాలు జరగటం ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత కూడా కొన్ని పరిణామాలతో రోజుల సంఖ్య తగ్గింది.

అధికమాసం అయితే రెండు

చాంద్రమానం ప్రకారం ప్రతి మూడవ ఏటా అధికమాసం వస్తుంది. ఇలా వచ్చిన సందర్భాల్లో కన్యామాసం (భాద్రపదం)లో ఒక బ్రహ్మోత్సవం, దసరా నవరాత్రుల్లో (ఆశ్వయుజం)లో మరోక బ్రహ్మోత్సవం నిర్వహిస్తారు. భాద్రపదంలో నిర్వహించే ఉత్సవాలను వార్షిక బ్రహ్మోత్సవాలు అనీ, నవరాత్రుల్లో నిర్వహించే ఉత్సవాలను నవరాత్రి బ్రహ్మోత్సవాలనీ పిలుస్తున్నారు. మిగిలిన కాలంలో కన్యామాసం, నవరాత్రులు కలిసే వస్తాయి కాబట్టి ఒకటే బ్రహ్మోత్సవం నిర్వహిస్తారు.



1957 నాటి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక



గతంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహన సేవ

రేపటి చంద్రబాబు పర్యటన ఇలా..



బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాల సమర్పణకు శుక్రవారం సీఎం చంద్రబాబు తిరుమల రానున్నారు. సాయంత్రం 6.20 గంటలకు తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకుంటారు. సంప్రదాయ వస్త్రధారణలో రాత్రి 7.40 గంటలకు బేడిఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణానికి వస్తారు. అక్కడ అర్చకులు చంద్రబాబుకు పరివట్టం చుట్టగా.. తలపై వెండిపళ్లెంలో పట్టువస్త్రాలను ఈవో ఉంచుతారు. మంగళవాయిద్యాల నడుమ 7.55 గంటలకు ఆలయానికి చేరుకుని వస్త్రాలను బహూకరించి మూలవర్లను దర్శించుకుంటారు. ఆ సమయంలో జీయంగార్లు శేషవస్త్రాన్ని మెడలో ధరింపచేస్తారు. అక్కడ్నుంచి రంగనాయకుల మండపానికి చేరుకుని 2025 టీటీడీ డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తారు. 9.15 గంటలకు తిరిగి పద్మావతి విశాంత్రి భవనం చేరుకుంటారు. శనివారం ఉదయం 7.30 గంటలకు పాంచజన్యం అతిథిగృహం వెనుకభాగంలో నిర్మించిన వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ప్రారంభించి 7.55 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

భద్రతపై ప్రత్యేక దృష్టి

ఇక ముఖ్యంగా భద్రతాపరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. టీటీడీ విజిలెన్స్ సీవీఎస్వో శ్రీధర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించుకున్నారు. దాదాపు 5వేల పోలీసు, భద్రతా సిబ్బంది తోపాటు సుమారు 2,500 సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. 8న గరుడసేవ సందర్భంగా 7వతేది అర్ధరాత్రి నుంచి, 9తేదీ ఉదయం 6గంటల వరకు ఘాట్‌రోడ్లలో ద్విచక్రవాహనాలను నిషేదించారు. శ్రీవారి ఆలయం, పోటు, అన్నప్రసాద విభాగం, వసతి, కల్యాణకట్ట, వైద్యం, ఆరోగ్యం, పీఆర్వో విభాగాలు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నాయి.

వారాహి సభ నేపథ్యంలో పవన్ కల్యాణ్ గతంలో తిరుపతి, తిరుమల వాసులకు ఇచ్చిన హామీలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. మే 7న కూటమి పార్టీల తరపున టీడీపీ అధినేత చంద్రబాబుతో కలసి ఎన్నికల ప్రచార రోడ్‌షోలో ఆయన ఈ హామీలు ఇచ్చారు. అధికారంలోకి రాగానే వాటిని నెరవేరుస్తామని మాట ఇచ్చారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మాటిచ్చారు... మరచిపోకండి!

జనసేనానికి తిరుపతి జనం వినతి

తిరుమల నిర్వాసితులకు ఇళ్లు : తన సోదరుడు చిరంజీవిని 2009లో తిరుపతి ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఆయనకు తిరుపతిపై ఎనలేని ప్రేమాభిమానాలున్నాయని పవన్ రోడ్ షోలో ప్రస్తావించారు. తిరుమల నిర్వాసితులకు 1100 ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని చిరంజీవి భావించారని, అందులో 149 ఇళ్ళు మాత్రమే పూర్తయ్యాయనీ, కూటమి అధికారంలోకి రాగానే మిగిలిన ఇళ్ళను కూడా నిర్మించి ఇస్తామని మాట ఇచ్చారు.

స్థానికులకు శ్రీవారి దర్శనం : గతంలో ప్రతి నెలా రెండవ మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శన సదుపాయం వుండేదనీ, వైసీపీ ప్రభుత్వం ఆ సదుపాయాన్ని తొలగించిందని విమర్శిస్తూ, తాము ఈ సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించారు.

తిరుపతిలో విద్యా, వైద్యానికి నిధులు : కొవిడ్ సంక్షోభ సమయంలో తిరుపతి రుయా ఆస్పత్రిలో ఆక్సిజన్ కొరత కారణంగా పలువురు రోగులు మరణించిన విషాదాన్ని గుర్తు స్తూ, టీటీడీ సహకారంతో విద్య, వైద్య రంగాలకు నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

మురికివాడల అభివృద్ధి : తిరుపతి నగరంలో 40కి పైగా మురికివాడలున్నాయంటూ,వైసీపీ విస్మరించిన వాటిని తాము అభివృద్ధి పరుస్తామని వాగ్దానం చేశారు. నగరంలో అస్తవ్యస్తంగా మారిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను బాగుచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని మాటిచ్చారు.

- వైసీపీ నేతల వేధింపులు, కక్షసాధింపు చర్యలతో పారిపోయిన పెద్ద పరిశ్రమలను తిరిగి తీసుకొస్తామని ప్రకటించారు.
- తిరుపతిని పవిత్ర కేంద్రంగా కాపాడే బాధ్యతను కూటమి తరఫున చంద్రబాబు, పురందేశ్వరి,తానూ కలసి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

● గుర్తుందా పవన్ సార్
నాలుగు రోజుల్లో రోడ్డన్నారు
మట్టితో సరిపెట్టారు
● బీఎన్ కండ్రిగ- సూళ్లూరుపేట రోడ్డును పట్టించుకోండి

జనసేనకు నాయకులు కావలెను
జిల్లాలో బలమున్నా కొరవడిన క్రియాశీలత
పవన్ కల్యాణ్ సమీక్షించి పటిష్ట పరుస్తారనే ఆశలో శ్రేణులు

- Iలో

మద్యం దుకాణాలకు మూడు టెండర్లు

జిల్లాలో 227 మద్యం దుకాణాలకు మంగళవారం కలెక్టరు నోటిఫికేషన్ జారీ చేశారు. వీటికిగాను తిరుపతి అర్బన్ పరిధిలో బుధవారం మూడు టెండర్లు దాఖలయ్యాయి. కాగా, టెండర్ల కోసం తిరుపతి అర్బన్‌లో నాలుగు, రూరల్‌లో మూడు, శ్రీకాళహస్తిలో రెండు, మిగిలిన స్టేషన్ల వద్ద ఒక్కోటి చొప్పున కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు.

- తిరుపతి(నేరవిభాగం)

మహాత్ముడికి ఘన నివాళి

గాంధీ జయంతి సందర్భంగా బుధవారం జిల్లాలో మహాత్ముడికి ఘన నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో మహాత్ముడి చిత్రపటానికి కలెక్టర్ వెంకటేశ్వర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు నగరంలోని గాంధీ విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగర పాలకసంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, డీఆర్వో పెంచలకిషోర్, పలు శాఖల అధికారులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(కలెక్టరేట్)



తిరుపతిలో గాంధీ విగ్రహం వద్ద కలెక్టరు, కమిషనరు తదితరుల నివాళులు

శోభాయమానం.. జెండా ఉత్సవం

గూడూరు, అక్టోబరు 2: గూడూరులో ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలు బుధవారం రాత్రి శోభాయమానంగా జరిగాయి. ఎటుచూసినా జనసంద్రంగా మారింది. బజారువీధిలోని కలిశంకొట్టు వద్ద ఆంజనేయస్వామి జెండాకు తొలుత పూజలు నిర్వహించారు. ఈ జెండాను పట్టణ పొలిమేర్లలో తిప్పి కలిశం కొట్టు వద్దకు తీసుకొచ్చి ప్రతిష్ఠించి పూజలు జరిపారు. దీంతో జెండా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆంజనేయ స్వామి జెండాలకు పూజలు చేశారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై జెండాలను ఉంచి ఊరేగించారు. ఈ ఊరేగింపు ముందు బ్యాండు మేళాలు, తప్పెట్లు, జింగిరి మేళం, కోలాటాలు, బాణసంచా పేలుళ్ళ, యువత చిందులతో సందడి చేశారు. బుట్టబొమ్మల వేషధారణలు అలరించాయి. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పలు వీధులలోని జెండా ఉత్సవాలకు హజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. ఈ జెండా ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి బంధుమిత్రులు, ఇతర చోట్ల ఉద్యోగాలు చేసే స్థానికులు, పరిసర గ్రామాల వారు తరలిరావడంతో పట్టణం సందడిగా మారింది. ప్రధానంగా గమళ్లపాళెం, తూర్పువీధి, కరణాలవీధి, మిట్టపాళెం, కోనేటిమిట్ట, కుమ్మరివీధి, అళఘనాథస్వామి దేవస్థానం, సత్రపువీధి, నలజాలమ్మవీధి, వీరారెడ్డిపల్లి, తిలక్‌నగర్‌సెంటర్, ఇందిరానగర్, అశోక్‌నగర్, నరసింగరావుపేట, అడివయ్యకాలనీ, సిరామిక్ సెంటర్, మాళవ్యానగర్, ఐసీఎస్ రోడ్డు, శివాలయం సెంటర్, అరుంధతీయనగర్ తదితర ప్రాంతాలలో జెండా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. డీఎస్పీ రమణకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.





ఆంజనేయ జెండా ఊరేగింపు

వెటర్నరీ విద్యార్థికి స్వచ్ఛతా హి సేవ పురస్కారం


అవార్డు అందుకుంటున్న సుధీర్

తిరుపతిరూరల్, అక్టోబరు2: స్వచ్ఛతా హిసేవ పక్షోత్సవాలను పురస్కరించుకుని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేస్ట్ టు వండర్ పోటీలలో తమ విద్యార్థి పీవీవీ సుధీర్ మొదటి బహుమతి సాధించారని ఎస్వీ వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నిర్వహించిన ఈ పోటీలలో చెత్త, వ్యర్థాలతో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం చిత్రాన్ని రూపొందించి, రూ.10వేల నగదు, పురస్కారం, సర్టిఫికెట్ అందుకున్నారని తెలిపారు. విద్యార్థిని ఆయనతోపాటు అధ్యాపకులు అభినందించారు.

63 ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు - నాటు తుపాకి స్వాధీనం

మంగళం, అక్టోబరు 2: కేవీబీపురం మండలం అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు బుధవారం కూంబింగ్ నిర్వహించి 63 ఎర్రచందనం దుంగలను, ఒక నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఆర్ఎస్ఐ ఎం.మురళీధర్‌రెడ్డి బృందం సోమవారం అర్ధరాత్రి కేవీబీపురం మండలం పచారుమాను వద్ద కూంబింగ్ నిర్వహించింది. కొంతమంది ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటబడ్డారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. గమనించిన స్మగ్లర్లు దుంగలను వదలి పారిపోయారు. ఇద్దరిని పట్టుకోగలిగారు. వదలివెళ్లిన 63 ఎర్రచందనం దుంగలను, నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడు వెటర్నరీ వర్సిటీ అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా జగపతిరామయ్య



తిరుపతిరూరల్, అక్టోబరు2: తమిళనాడు వెటర్నరీ వర్సిటీ(తనువాస్) అకడమిక్ కౌన్సిల్ సభ్యుడిగా తిరుపతికి చెందిన ఎస్వీ వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఆ వర్సిటీ రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన మూడేళ్లపాటు ఆ పదవిలో కొనసాగుతారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ


ప్రథమ బహుమతి సాధించిన దానిష్, తృతీయ బహుమతి సాధించిన నారాయణ విద్యార్థులు

తిరుపతి(విద్య), అక్టోబరు 2: తిరుపతి నగర పాలక సంస్థ నిర్వహించిన స్వభావ స్వచ్ఛత - సంస్కార స్వచ్ఛతలో తమ విద్యార్థులు సత్తాచాటారని స్థానిక టాటానగర్ నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ సి.రవికాంత్ వెల్లడించారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పరుగు పందెంలో 4వ తరగతి విద్యార్థి ఎస్‌కే దానిష్ ప్రథమ స్థానంలో నిలిచి రూ.5వేల నగదు బహుమతి అదుకున్నారని, వేస్ట్ టు ఆర్ట్ - వేస్ట్ టు వండర్ ఎగ్జిబిట్ ద్వారా తమ విద్యార్థి బృందం తృతీయ బహుమతి సాధించిందని చెప్పారు. కచ్చపి ఆడిటోరియంలో బుధవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ చేతులమీదుగా నారాయణ విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. విద్యార్థులను డీజీఎం కొండల్‌రావు, ఏజీఎం శ్రీనివాసరావు, ఆర్ఐ వసంత్‌కుమార్ అభినందించారు.

రాయలచెరువుపేటలో స్వచ్ఛభారత్

రామచంద్రాపురం, అక్టోబరు 2: గ్రామ స్వరాజ్యం తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమని మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో గాంధీ జయంతి సందర్భంగా గ్రామసభలు జరిగాయి. తిరుమలరెడ్డి మాట్లాడుతూ వైసీపీ హయాంలో పంచాయతీ నిర్వీర్యమయ్యాయన్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతోనే పంచాయతీలకు నిధులను విడుదల చేసిందన్నారు. రాయలచెరువుపేటలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో వీధులను శుభ్రపరిచారు.

మూలస్థాన ఎల్లమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

చంద్రగిరి, అక్టోబరు 2: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈసందర్భంగా పట్టణంలో జాతీయ రహదారి నుంచి కొత్తపేట వరకు విద్యుత్ దీపాలకంరణ చేశారు. ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. నవరాత్రి ఉత్సవాలు పూర్తయ్యే వరకూ మహిళలు అమ్మవారి మాల దీక్షలో ఉంటారు. వేకువజామున వీరు ఆలయం వద్ద స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మోత్సవాల్లో కట్టుదిట్టమైన భద్రత

పోలీసులతో టీటీడీ అదనపు ఈవో చౌదరి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

తిరుమల, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): భక్తులతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ కట్టుదిట్టమైన భద్రతను కల్పించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పోలీసు అధికారులు, సిబ్బందిని కోరారు. తిరుమలలోని రాంభగీచ విశ్రాంతి భవనాల ముందున్న పోలీస్ కంట్రోల్ రూంలో బుధవారం జరిగిన పోలీసుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతపురం రేంజ్ డీఐజీ షేమూషి బాజ్‌పాయ్ మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసి భక్తులకు సులభంగా శ్రీవారి దర్శన భాగ్యం కలిగేలా సేవలందించాలన్నారు. పోలీసుల వల్ల తప్పులు జరగకూడదన్నారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. అనునిత్యం సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ భక్తులకు మెరుగైన సేవలందించాలని పోలీసులను కోరారు. గరుడసేవరోజున మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. సీఎం పర్యటన పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది చాలా జాగ్రత్తగా పనిచేయాలన్నారు.

ఉపాధి పనులను తనిఖీ చేసిన కేంద్ర బృందం

రామచంద్రపురం, అక్టోబరు 2: అనుపల్లె, నెత్తకుప్పం, గంగిరెడ్డిపల్లె గ్రామాల్లో ఉపాధి పనులతో పాటు మహిళా పొదుపు సంఘాలను కేంద్ర కమిటీ బుధవారం తనిఖీ చేసింది. అనుపల్లెలో ఉపాధి పనులను పరిశీలించింది. కూలీల పైకం వివరాలను ఆరా తీసింది. గంగిరెడ్డిపల్లిలో పొదుపు మహిళా సంఘాలతో సమావేశమైంది. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచ్ భారతి, ఏసీ వనజాక్షి,ఏపీఎం గురుమూర్తి, వీసీలు సుధాకర్, శివాజీ, గుర్రమ్మ, పార్వతి, సంఘమిత్ర జయభారతి పాల్గొన్నారు.

200మంది విద్యార్థులకు రూ. 40 లక్షల ఉపకార వేతనాలు


ట్రస్టుకు రూ.50లక్షల చెక్కును అందిస్తున్న గల్లా అరుణ తదితరులు

పూతలపట్టు, అక్టోబరు 2: పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడమే కృష్ణ దేవరాయ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ధ్యేయమని మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి అన్నారు. పూతలపట్టు మండలం పేటమిట్టలో బుధవారం అసోసియేషన్ వార్షికోత్సవ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి రాజగోపాలనాయుడు స్ఫూర్తితో ట్రస్టు ఏర్పాటు చేశామన్నారు. ఇటీవల తాను రచించిన స్వీయ చరిత్ర పుస్తకం 5వేల కాపీలు అమ్మడం ద్వారా వచ్చిన రూ.50 లక్షలను ట్రస్టుకు విరాళంగా అందిస్తున్నానన్నారు. అమరరాజా సంస్థల వ్యవస్థాపకుడు గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ 1968లో వెయ్యి రూపాయల పెట్టుబడితో ట్రస్టును స్థాపించగా నేడు వంద కోట్లకు చేరిందన్నారు. ఈ నిధులను విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగిస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ గౌరినేని రమాదేవి మాట్లాడారు. అనంతరం పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, సీఏ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన 200 మంది విద్యార్థులకు రూ.40 లక్షల మేర ఉపకార వేతనాలను అందించారు. టీటీడీ పూర్వ జేఈవో శ్రీనివాస రాజు, పీఈఎస్ యూనివర్శిటీ చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి, ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, సాహితీ ప్రముఖుడు సాకం నాగరాజ, అసోసియేషన్ కార్యదర్శి గల్లా విజయ్ నాయుడు, సభ్యులు మహదేవ నాయుడు, సతీష్, రాళ్లపల్లె, గల్లా రాజశేఖర్, బాలాజీ కిరణ్, ఉమాకాంత్, సర్పంచ్ గల్లా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి

భాకరాపేట, అక్టోబరు 2: గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలని ఎంపీడీవో సోమశేఖర రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలంలో భాకరాపేట, చిట్టేచర్ల, నెల్లుట్లవారిపల్లె పంచాయతీల్లో చెత్తసేకరణ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఇంటా చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించాలన్నారు. దీంతో ఎరువులు తయారు చేసి విక్రయించి గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. సర్పంచులు నాగచంగమనాయుడు, భూపాల్, శశిప్రియ, కార్యదర్శి రామ్మోహన, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

తిరుచానూరు, అక్టోబరు 2: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో బుధవారం నుంచి 12వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రోజూ మధ్యాహ్నం 3గంటలకు ఆలయంలోని శ్రీకృష్ణస్వామి ముఖమండపం వద్ద పద్మావతి అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీల్లు, ఇతరపండ్ల రసాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. రాత్రి 7గంటలకు ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. 12వ తేదీ విజయదశమినాడు రాత్రి 7.45గంటలకు పద్మావతి అమ్మవారు గజవాహనపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాల కారణంగా బుధవారం నుంచి పదిరోజుల పాటు కల్యాణోత్సవ సేవను రద్దు చేశారు. 4,11 తేదీల్లో లక్ష్మీపూజ, 12న ఊంజల్‌సేవను టీటీడీ రద్దు చేసింది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు

తిరుమల, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

భాకరాపేట, అక్టోబరు 2: గాంధీ జయంతి వేడుకలను చిన్నగొట్టిగల్లు మండలంలో అన్ని గ్రామ పంచాయతీలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాకరాపేటలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను పూలమాలలు, శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, వైఎస్-ఎంపీపీ సునీత దామోదర్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, కార్యదర్శి రామ్మోహన, మదనమోహన రాజు, సర్పంచ్ మనోహర, సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, రాజశేఖర్, రఘునాథ్, చోటాసాహెబ్, నాగరాజ, గురుమోహన్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త కమిటీతో నాగాలమ్మ ఆలయ అభివృద్ధి

చంద్రగిరి, అక్టోబరు 2: భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని నాగాలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరారు. పురాతన నాగాలమ్మ ఆలయాన్ని ఇటీవల ఆలయ నిర్వాహకులు, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ ఒంటి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పునర్నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డిపై కొందరు ఆరోపణలు చేయడంతో బుధవారం రాత్రి చంద్రగిరి, వెంకటపేట, రాయలపురం గ్రామస్థులతో పాటు భక్తులు, దాతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు అభివృద్ధి నివేదిక, విరాళాలు, ఖర్చులు, తదితర అంశాలపై భక్తులకు వివరించారు. ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు జానకిరామిరెడ్డి, రాజాలు మాట్లాడారు. విజయదశమి రోజున కొత్త కమిటీ వేసి అభివృద్ధి, నిర్వహణ చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు.

పారిశుధ్య కార్మికులు, క్లాప్ మిత్రలకు సన్మానం

పాకాల, అక్టోబరు 2:పాకాల పెన్షన్ కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్లాటినం లైన్స్ క్లబ్ అధ్యక్షుడు తులసిరామన్ పూలమాలవేశారు. ఈసందర్భంగా ఎం.కుమారస్వామి నాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ పాత్రను వివరించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు,క్లాప్‌మిత్రలను సత్కరించారు. జయరామ్ నాయుడు, మునస్వామినాయుడు, జీవి ప్రసాద్, నారాయణరావు,విశ్రాంతి ఉద్యోగులు, పాల్గొన్నారు. చంద్రగిరి: చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలో బుధవారం గాంధీ చిత్రపటానికి సర్పంచ్ రూపా రామ్మూర్తి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిబ్బందికి స్వీట్లు పంచిపెట్టారు. స్వచ్ఛత హే సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవో మహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్షయక్షేత్రం వ్యవస్థాపక దినోత్సవం

రామచంద్రాపురం, అక్టోబరు 2: దుర్గసముంద్రంలోని అక్షయక్షేత్రంలో బుధవారం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత మహాత్మగాంధీ, ఆశ్రమ వ్యవస్థాపకులు ఎం.రామస్వామి, ఎం.వరలక్ష్మి దంపతుల చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన భారతీయభవన్ కరెస్పాండెంట్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ వ్యవస్థాపకులు సొంతనిధులు, దాతల సహకారంతో ఆశ్రమాన్ని దినదినాభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ప్రత్యేక శిక్షకుల పర్యవేక్షణలో వందమంది బాలలను సంరక్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యప్రసాద్, విశ్రాంత ప్రభుత్వం ఉద్యోగి రఘురామిరెడ్డి, ఆశ్రమ డైరెక్టర్ అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో సంగీత దర్శకుడు తమన్

తిరుమల, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): సినీ సంగీత దర్శకుడు తమన్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం తర్వాత గాయత్రి అతిథిగృహానికి వెళ్లి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

26న కార్తీక్ లైవ్ ఈవెంట్

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 2: తారకరామ స్టేడియంలో ఈనెల 26వ తేదీన కార్తీక్ లైవ్ ఈవెంట్ నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా 10 నుంచి 15వేల మంది పాల్గొనేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రూ.600 నుంచి రూ.3,500 వరకు నాలుగు రకాల టికెట్స్ అందుబాటులో ఉంచామని, కావాల్సిన వారు బుక్‌మైషో యాప్‌ను సంప్రదించాలని కోరారు. సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్.థమన్ ముఖ్య అతిథిగా రానున్నట్లు తెలిపారు.

మర్చిపోయిన బ్యాగు తిరిగి అప్పగింత



తిరుమల, అక్టోబరు2 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదాలు స్వీకరించేందుకు వచ్చి మర్చిపోయిన బ్యాగును తిరిగి అధికారులు భక్తురాలికి అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్ లక్ష్మీప్రసన్న బుధవారం ఉదయం 11.30 గంటలకు వెంగమాంబ అన్నప్రసాద భవనానికి వచ్చారు. రెండవ నెంబరు హాల్‌లో అన్నప్రసాదాం స్వీకరించారు. అదే సమయంలో హ్యాండ్ బ్యాగును మర్చిపోయారు. కాంట్రాక్ట్ వర్కర్ నాగరాజు ఈ బ్యాగును గుర్తించి టీటీడీ సిబ్బందికి అందజేశాడు. కొంతసమయం తర్వాత బ్యాగు మర్చిపోయానంటూ వచ్చిన లక్ష్మీప్రసన్న నుంచి సిబ్బంది వివరాలు సేకరించి ధ్రువీకరించుకున్నారు. అన్నప్రసాద విభాగం అధికారులు శివశంకరయ్య, వెంకటరమణ, సిబ్బంది నారాయణ, తిమ్మప్ప, తులసి, కోదండ, రత్నప్రభాకర్ కలిసి ఆ బ్యాగ్‌ను భక్తురాలికి అందజేశారు. బ్యాగులో రూ.4లక్షల విలువైన డైమండ్ నగలు, రూ.1,120 నగదు, ఏటీఎం, ఆధార్ కారు ఉన్నట్లు భక్తురాలు తెలిపింది.

నేటి నుంచి జ్యోతి చౌడేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలు

భాకరాపేట, అక్టోబరు 2: చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డ పంచాయతీ తొగటపల్లెలోని జ్యోతి చౌడేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



తిరుపతి అర్బన్, అక్టోబరు 2: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరపాలక సంస్థకు సంబంధించిన 15 మంది పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న శాఖలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు హాజరై కార్మికుల సేవలను కొనియాడారు. వారికి గులాబీ అందించి, శాలువ కప్పి సత్కరించారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు సారె



రామచంద్రాపురం, అక్టోబరు 2: శక్తి పీఠంలోని గ్రామదేవత ముత్యాలమ్మకు రాయలచెరువుపేట గ్రామస్థులు బుధవారం మేళతాళాల నడుమ సారె సమర్పించారు. ఏటా వీరు సారె సమర్పించాక పీఠంలో దేవీ నవరాత్రులు ప్రారంభమవుతాయి. టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ సర్పంచులు నాగభూషణం, మాధవి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్ మాస్టర్ల అడ్వాన్స్ కోర్సు శిక్షణ

తిరుచానూరు, అక్టోబరు 2: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యత స్కౌట్ మాస్టర్లదేనని డీఈవో శేఖర్ అన్నారు. తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కౌట్ మాస్టర్ల అడ్వాన్స్ కోర్సు శిక్షణను బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లా కార్యదర్శి జయరామ్ మాట్లాడుతూ 4వ తేదీ వరకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. అంతకుముందు గాంధీ జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిషనర్ ఎంఎంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కుప్పిరెడ్డి, రాష్ట్ర నిర్వాహక సహాయ కమిషనర్ కోటేశ్వరరావు, బాలిప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంకటముని, ప్రధానోపాధ్యాయులు మురళి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో ఖాళీలను భర్తీ చేయండి


పవన్‌కు శ్రీవారి ప్రతిమ అందజేస్తున్న కిరణ్

తిరుపతి అర్బన్, అక్టోబబరు 2: టీటీడీలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన పవన్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలసి టీటీడీ ఉద్యోగుల సమస్యలను విన్నవించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పవన్ హామీ ఇచ్చారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

తిరుపతి(లీలామహల్), అక్టోబరు 2: ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి తులసీరామ్ పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరిగే ఈ టోర్నమెంట్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభిస్తారని, 16 జట్లు పాల్గొంటాయని తెలిపారు. వైద్యులు ఒత్తిడి నుంచి దూరం కావడానికే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో వినీత్, పీఆర్వో కిరణ్ పాల్గొన్నారు.

జూపార్కులో వన్యప్రాణి వారోత్సవాలు

మంగళం, అక్టోబరు2: ఎస్వీ జూపార్కులో బుధవారం వన్యప్రాణి వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. క్యూరేటర్ సెల్వం మాట్లాడుతూ వన్యప్రాణి వారోత్సవాలను 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అడవులు, వన్యప్రాణుల ఆవశ్యకత గురించి వివరించారు. రేంజ్ ఆఫీసర్ జగదీష్, దీపక్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 2: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ పరిశోధకులు ఎన్.శ్రీవిష్ణు డాక్టరేట్ పొందారు. డీప్ లెర్నింగ్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ఫర్ స్మార్ట్ అగ్రికల్చరల్ సొల్యూషన్స్ అంశంపై ప్రొఫెసర్ జి.అంజన్‌బాబు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

పండ్లు, అల్పాహారం వితరణ

తిరుపతి అర్బన్, అక్టోబరు 2: గాంధీ జయంతిని పురస్కరించుకుని కేశవాయనగుంట పాస్ మనోవికాస్ కేంద్రానికి బుధవారం గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండ్లు, అల్పాహారం వితరణ చేశారు. సంఘం అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ట్రెజరర్ పోతప్ప, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

పాస్‌పోర్ట్ దారిపోయినది
తిరుపతి జిల్లా తిరుపతి అర్బన్ మండలం, ఎం.ఆర్.పల్లి సర్కిల్ దగ్గర, న్యూ బాలాజీ కాలనీ, డి. నెం. 8-172, ఫ్లాట్ నెం.187లో కాపురముండు లేట్ ఎ. నరసింహులు నాయుడు గారి కుమారుడు ఎ.సౌందర్ నాయుడు (నా యొక్క) Passport No.U1740743 and VISA No.M6531637 తేది: 26-07-2024 కారులో తిరుపతి నుండి వెళుతుండగా ఎం.ఆర్. పల్లి సర్కిల్ వద్ద దారిపోయినది. ఆచూకి తెలిసిన వారు దిగువ ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు. సంప్రదించండి: 9393640508.
AJT - 10837

CHANGE OF NAME
I, Sapala Sreeramulu (Old Name), R/o: 12/83, Mandaram, Mannur, Rajampet, Annamayya Dt. A.P. Do here by declared I have changed my surname as Chapala Sreeramulu (New Name) S/o Chapala Lakshumaiah.
AJT - 4343

LAND FOR LEASE
వ్యవసాయం భూమి లీజుకు కావలెను. 5 ఎకరాల నుండి 10 ఎకరాల వరకు. తిరుపతి నుండి 10 నుండి 15 కి.మీ. లోపు. సంప్ర. : 91777 27987.
AJT - 200553

బంగారం కొనబడును
పీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(లైసెన్స్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA - 198089

కామాఖ్య రైల్ యాత్ర
కలకత్తా, కామాఖ్య, వైద్యనాథ్, గయా తేది: 15-02-25. 12 రోజులు టికెట్ 1కి 22,000/- (రైలు, A/C బస్సు, A/C రూం+ భోజనం) కె.వాసు, నెల్లూరు. సం.ప్ర. సెల్: 94913 40504
AJR-193920

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, దట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 2: దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరగని పోరాటం చేసిన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆకాంక్షించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఎస్పీ మాట్లాడుతూ గాంధీ ఆశయ సాధనలో భాగంగా గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, నాగభూషణరావు, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ఎస్వీ వెటర్నరీ కళాశాలలో..

తిరుపతిరూరల్ : ఎస్వీ వెటర్నరీ కళాశాలలో నిర్వహించిన గాంధీ జయంతిలో పలువురు అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పుష్పాలతో ఘన నివాళి అర్పించారు. విద్యార్థులకు క్విట్ ఇండియా ఉద్యమంపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించి ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ జీఆర్‌కే శర్మ, ఓఎస్‌పే డాక్టర్ వేణు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డితో ఏవో పిచ్చిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పుష్పాంజలితో నివాళి అర్పించారు. హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో..

మంగళం : తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, ఎస్పీ సుబ్బరాయుడు, టాస్క్‌పోర్సు ఎస్పీ శ్రీనివాస్ గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ రఫీ, ఎఫ్ఆర్‌వోలు మురళీకృష్ణ, ప్రేమ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), అక్టోబరు 2: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు గాను జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగనుందని వెల్లడించారు.ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతిలో, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వివరించారు. పరీక్ష రాయదలుచుకున్న విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8688888802, 9399976999లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి





ఎస్వీయూలో గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు - పద్మావతి వర్సిటీలో గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 2: జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్వీయూ గ్రంథాలయం వద్దనున్న గాంధీ విగ్రహానికి రిజిస్ట్రార్ భూపతి నాయుడు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. ప్రపంచానికి శాంతి మార్గాన్ని నిర్దేశించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. గాంధీ కృషిని అధ్యయనం చేసి ఈ తరం స్ఫూర్తి పొందాలని కోరారు. కార్యక్రమంలో లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేంద్ర నాయుడు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ● పద్మావతి వర్సిటీలోని గాంధీ విగ్రహానికి ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఉమ పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. స్వర్ణాంధ్ర-2047 అంశంపై నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

7న తిరుపతికి గొడుగుల రాక



ఊరేగింపుగా బయల్దేరిన గొడుగులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 2: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో చెన్నైకి చెందిన దాతల గొడుగులు ఈ నెల 7వ తేదీన తిరుపతికి చేరుకోనున్నాయి. ఈ మేరకు బుధవారం చెన్నైలోని చెన్నకేశవ పెరుమాళ్ ఆలయంలో హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ చైర్మన్ ఆర్.ఆర్.గోపాల్ ఆధ్వర్యంలో గొడుగులకు పూజలు నిర్వహించి, యాత్రను ప్రారంభించారు. అయనవరం, విల్లివాక్కం, తిరువళ్లూరు మీదుగా ఆంధ్రాలోకి ప్రవేశించి సోమవారం తిరుపతి చేరుకోనున్నాయి. రెండు గొడుగులు తిరుచానూరు పద్మావతి అమ్మవారికి, తొమ్మిది గొడుగులు తిరుమల శ్రీవారికి సమర్పించనున్నారు.

బీజేపీ విభజించి పాలిస్తోంది : కాంగ్రెస్



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 2 : విభజించి పాలించు రీతిలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ప్రధాని మోదీ ఎత్తుగడలను ప్రజలు తిప్పికొడతారని కాంగ్రెస్ పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ఏకపక్ష నిర్ణయాల వల్ల గాంధీ కలలు కన్న పాలన కనుమరుగైందన్నారు. గాంధీ కలలుగన్న పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ బీసీ సెల్ కో-ఆర్డినేటర్ కంభంపాటి మురళీకృష్ణ, కాంగ్రెస్ నేతలు సుప్రజా, నరేంద్రబాబు, లోకేశ్వర్‌రెడ్డి, పార్థసారథి రెడ్డి, గోపీ గౌడ పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి శాప్ చైర్మన్ సన్మానం



తిరుపతి, అక్టోబరు2 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు గురువారం ఉండవల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి విగ్రహం, శాలువాను ఆమెకు అందజేసి, ఆశీస్సులు తీసుకున్నారు. శాప్ చైర్మన్ పదవికి వన్నె తీసుకురావాలని చెబుతూ పదవి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డావని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, క్రీడారంగాన్ని అభివృద్ధి చేస్తానని రవినాయుడు అన్నారు.









నిర్వాకోట గ్రామం దగ్గర ఇరువైపుల మట్టి తోలని దృశ్యం

పవన్ సారూ..గుర్తుందా!

నాలుగు రోజుల్లో రోడ్డన్నారు.. మట్టితో సరిపెట్టారు



రోడ్డుకు ఇరువైపుల తోలిన చోట వర్షానికి ఏర్పడిన గుంతలు

"పవన్ కల్యాణ్ సారూ.. మీరు మాటిచ్చారు. ఇక మా తిప్పలు తప్పిపోయినాయి అని సంబరపడ్డాం. నాలుగంటే..నాలుగే రోజుల్లో రోడ్డు రెడీ అయిపోతుందని నమ్మినాం. రెండు నెలలు దాటిపోయిందయ్యా.. అదే రోడ్డు.. అవే తిప్పలు.. కాకపోతే మీరు చెప్పినారు కదా అని రోడ్డువారన ఇంత మట్టి పోసి చేతులు దులిపేసుకున్నారు. దీక్ష చేసి తిరుపతికి వచ్చారు. అదే దీక్షతో మీరు చెప్పిన మాట ఎందుకు అమలు కాలేదో అధికారులని అడగండయ్యా.."


బీఎన్ కండ్రిగ- సూళ్లూరుపేట మధ్య రోజూ ప్రయాణించే ప్రజల గోడు ఇది. అపాచీ, శ్రీసిటీ సెజ్‌ల్లో పనిచేయడానికి వేలాది మంది ఆటోల్లో, బైకుల్లో, బస్సుల్లో తిరిగే ఈ రోడ్డు దుస్థితి గురించి శ్రీహరికోట పర్యటనకు వచ్చినపుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి ఉద్యోగులు తీసుకువచ్చారు. ఆయన స్పందించి నాలుగు రోజుల్లో డబుల్ రోడ్డు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ వెంటనే అధికారులు రోడ్డుకి అటూఇటూ మట్టి పోసి పని పూర్తి చేశామనుకున్నారు. ఈ సింగల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే కాంట్రాక్టు మూడేళ్ల కిందట అప్పటి మంత్రి గారి సంస్థే చేపట్టింది. మొదలుపెట్టి నాలుగు కిలోమీటర్లు వేసి ఆపేశారు. వందలాది వాహనాలు తిరిగే ఈ రోడ్డులో ఎదురు వాహనం వస్తే ప్రయాణం ప్రాణాంతకంగా మారుతోంది. కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే వాళ్లు ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. నాయకులెవ్వరూ పట్టించుకోలేదు. ఇంత కాలానికి డిప్యూటీ సీఎం దయ వల్ల రోడ్డు పని తిరిగి కదిలిందనుకుంటే అదీ మొక్కుబడిగా ముగించేశారు. ఈశాన్యపు వానలు మొదలు కాబోతున్నాయి. పోసినమట్టి బురదగుంతలుగా మారి మరింత ఘోరంగా తయారయ్యే అవకాశం ఉంది. అందరు నాయకుల్లా ఆదేశాలతో సరిపెట్టుకోకుండా, నిధులు ఇప్పించే ఏర్పాటు కూడా పవన్ కల్యాణ్ చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

- బుచ్చినాయుడుకండ్రిగ

జనసేనకు నాయకులు కావలెను

జిల్లాలో బలమున్నా కొరవడిన క్రియాశీలత

పవన్ కల్యాణ్ సమీక్షించి పటిష్ఠ పరుస్తారనే ఆశలో కేడర్



తిరుపతి, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో జనసేన సందడంతా తిరుపతికే పరిమితం అయ్యింది. ఆ పార్టీ ఎమ్మెల్యే ఉండడం, అంతకు ముందు నుంచే పార్టీ స్వరం గట్టిగా వినిపించే యువ నాయకులు తిరుపతిలో ఉండడం ఇందుకు కారణాలు. ఇతర నియోజకవర్గాల్లో నాయకత్వ కొరత స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీ కూడా తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట నియోజకవర్గాలకు మాత్రమే పార్టీ ఇంఛార్జులను నియమించింది. మిగిలిన చంద్రగిరి, సత్యవేడు, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాలకు సమన్వయకర్తలతో సరిపెట్టింది. తిరుపతిలో నేడు వారాహి సభలో పాల్గొంటున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీలో ఉన్న వెలితిని గుర్తించి, పటిష్ఠపరిచే చర్యలకు శ్రీకారం చుడతారనే ఆశ జనసేన కేడర్‌లో ఉంది.

తిరుపతిలో సఖ్యత లేదు

తిరుపతిలోనూ జనసేన నేతల మధ్య సఖ్యత లేదు. ఎన్నికల ముందు మొదలైన తేడాలు ఇప్పటికీ పూడనే లేదు. ఇందుకు తగిన ప్రయత్నాలను పార్టీ అధిష్ఠానం కూడా గట్టిగా చేయలేదు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతిలో తొలినుంచీ పార్టీ జెండా మోస్తున్నవారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని స్థానిక నేతల అసంతృప్తి. స్థానిక నేతలు కొందరు ఎమ్మెల్యేను సంప్రతించకుండా సొంత పద్ధతిలో కార్యక్రమాలు కొనసాగిస్తూ ఉండడం పట్ల ఎమ్మెల్యే వర్గం కూడా కినుకతో ఉంది. తిరుపతి కేడర్‌ను పట్టించుకోకుండా చిత్తూరు నుంచి మనుషులను దించారనీ, వైసీపీ మద్దతుదారులకే మేలు చేకూరేలా నిర్ణయాలు కొనసాగుతున్నాయనీ స్థానిక జనసేన నేతలు అంటున్నారు. విభేదాల నేపథ్యంలో నగరంలో అన్ని డివిజన్లలోనూ కేడర్‌ను పటిష్ఠపరచుకునే ప్రయత్నం కూడా సరిగా జరగడంలేదు. వైసీపీ కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో దూకడానికి సిద్ధంగా ఉన్నా నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో జనసేన నాయకులున్నారు. టీడీపీ, బీజేపీలతో సమన్వయంలోనూ వెలితి స్పష్టంగా కనిపిస్తోంది. తిరుపతిలో టీడీపీకి తొలి నుంచీ బలం ఉంది. ఆ పార్టీ నాయకులు జనసేనతో కలిసి వేదికల మీద కనిపిస్తూ ఉన్నా, డివిజన్ స్థాయి టీడీపీ కేడర్‌ను పట్టించుకోవడం లేదనే అసంతృప్తి ఉంది.

శ్రీకాళహస్తిలోనూ వర్గ పోరు

తిరుపతి తరువాత కాస్తో కూస్తో జనసేన కార్యక్రమాలు కనిపించేది శ్రీకాళహస్తిలోనే. అయితే అక్కడా పార్టీ రెండు గ్రూపులుగా విడిపోయింది. ఇక చంద్రగిరిలోనూ జనసేనలో రెండు వర్గాలున్నాయి. ఎర్రావారిపాలెం మండలానికి చెందిన ఓ నేత ఇంఛార్జిగా చెప్పుకుంటూ భూముల కబ్జాలకు పాల్పడుతున్నారంటూ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కూడా జరిగింది. ఇక మిగిలిన నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు తమను పట్టించుకోవడం లేదనే అసంతృప్తి జనసేన నేతల్లో ఉంది. ఈ నియోజకవర్గాల్లో కార్యక్రమాలన్నీ మొక్కుబడిగానే సాగుతున్నాయి. సామాజికవర్గం పరంగా జిల్లాలో అనేక నియోజకవర్గాల్లో జనసేనకు బలం ఉంది. అలాగే పవన్‌కల్యాణ్ అభిమానులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. అయితే దానిని రాజకీయంగా అనుకూలంగా మలచుకోవడంలో జనసేన ప్రయత్నాలు గట్టిగా లేవని అంటున్నారు. తిరుమల స్వామి దర్శనం తర్వాత తిరుపతిలో నేడు వారాహి సభలో పాల్గొంటున్న పవన్ కల్యాణ్ నియోజకవర్గాల వారీగా పరిస్థితులను సమీక్షించి, పటిష్ఠ పరిచే ప్రయత్నాలు చేస్తారనే ఆశలో కేడర్ ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో నాయకత్వ ఎంపిక పూర్తి చేసి, వారికి దిశానిర్దేశం చేయాలని వారు కోరుకుంటున్నారు.

శ్రీవారిని స్మరిస్తూ..

● 50 నిమిషాల పాటు ఆలయంలో గడిపిన పవన్



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న పవన్

తిరుమల, అక్టోబరు2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీసీఎం హోదాలో తొలిసారిగా తిరుమలకు వచ్చిన పవన్‌కల్యాణ్ శ్రీవారిని స్మరిస్తూ ఆలయంలో 50 నిమిషాలు గడిపారు. బుధవారం ఉదయం 10.15 గంటలకు తన ఇద్దరు కుమార్తెలు ఆధ్య, పొలెనా అంజనతో కలిసి మహద్వారం వద్దకు చేరుకోగా అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకులు స్వాగతం పలికారు. క్యూలైన్ ద్వారా వచ్చిన దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయితో కలిసి స్వామిని దర్శించుకున్నారు. 10.55 గంటలకు రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. 11.05 గంటలకు ఆలయం వెలుపలకు వచ్చిన ఆయన.. మాడవీధులో నడుచుకుంటూనే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకున్నారు. కొందరు భక్తులతో మాట్లాడి తానూ వారితో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. చాలా రుచిగా ఉందంటూ ప్రశంసించారు. అన్నప్రసాదాల నాణ్యతను పెంచేందుకు తీసుకున్న చర్యల గురించి అదనపు ఈవో వెంకయ్య చౌదరి, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి వివరించారు. మధ్యాహ్నం నుంచి ఆయన అతిథిగృహానికే పరిమితమయ్యారు. ధ్యానంలో గడిపారు. శుక్రవారం జపాలి ఆంజనేయస్వామిని దర్శించుకుని.. సాయంత్రం తిరుపతిలో జరిగే వారాహి సభలో పాల్గొననున్నారు. భక్తులకు ఇబ్బంది కలిగించకూడదనే ఉద్దేశ్యంతో పవన్ మహద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లినట్టు అధికారులు తెలిపారు. దీక్షలో ఉన్న పవన్ కాలినడకన తిరుమలకు రావడంతో చాలా నీరసంగా కనిపించారు. ఎవరితోనూ పెద్దగా మాట్లాడలేదు. పవన్‌తో పాటు ఎంఎల్సీ హరిప్రసాద్, ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, ఆరణి శ్రీనివాసులు, స్థానిక నేతలు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి తదితరులు శ్రీవారిని దర్శించుకున్నారు.

ముక్కంటి ఆలయ ఏఈవో ధనపాల్ సస్పెన్షన్

శ్రీకాళహస్తి, అక్టోబరు 2: ముక్కంటి ఆలయ ఏఈవో ధనపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఆదేశాలు జారీ చేశారు. ఆలయ ఈవోగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ ఇటీవల పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గోశాలను బుధవారం ఉదయం పరిశీలించారు. గోశాల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది వైఫల్యాలను గుర్తించారు. గోశాల ఏఈవో ధనపాల్ పర్యవేక్షణ విఫలంతో వందలాది గోవులకు ప్రాణాంతక సమస్య ముప్పు వాటిల్లుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ పాలనలో ఏఈవోగా ధనపాల్ ఆలయం తరఫున ఏర్పాటు చేసిన విభూది విక్రయ కేంద్రాల్లో అవకతవకలకు పాల్పడినట్లు విచారణ ద్వారా గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయ ఉద్యోగి గంగాధరం సతీమణి పేరుతో విభూది విక్రయ టెండర్‌ను దక్కించుకోవడంలో ధనపాల్ పాత్ర ఉందని... అందులో సంప్రదాయాలకు విరుద్ధంగా ప్లాస్టిక్ ప్యాకింగ్ ఉపయోగించడం, అలాగే టెండర్లకు విరుద్ధంగా అదనపు వస్తువులను కౌంటర్‌లో విక్రయించడం, దాంతో పాటు టెండర్ షరతులను ఉల్లంఘిస్తూ కౌంటర్‌లో విక్రయించే వస్తువులపై ముక్కంటి ఆలయ దేవతామూర్తుల బొమ్మలను ముద్రిదంచడం వంటి చర్యలను ఈవో తప్పు పట్టారు. ఏఈవో ధనపాల్ పర్యవేక్షణలో 9 వైఫల్యాలను పొందుపరుస్తూ సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. ఇతని బాధ్యతలను డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డికి అప్పగించారు.

గ్రామీణ అభియాన్‌కు మూడు గ్రామాల ఎంపిక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు2: ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత గ్రామ్ అభియాన్‌కు జిల్లాలో మూడు గ్రామాలు ఎంపికైనట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇందులో డక్కిలి మండలం కండలవారిపల్లి, శ్రీకాళహస్తి మండలం మేలచ్చూరు, వరదయ్యపాళెం మండలం పాదిరికుప్పం గ్రామాలు ఉన్నట్లు వెల్లడించారు. గిరిజనాభివృద్ధిపై దృష్టి సారించి, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, జీవనోపాధి వంటి కీలక సేవలను విస్తరించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు.

సమాజ స్థాపనకు యువత కృషి చేయాలి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయబాబు



పుత్తూరు అర్బన్, అక్టోబరు 2: మహాత్మాగాంధీ స్ఫూర్తితో యువత సమ సమాజ స్థాపనకు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విజయబాబు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా మహనీయుడికి నివాళి అర్పించారు. అహింస అనే ఆయుధంతో బ్రిటీష్ ప్రభుత్వానికి నిద్రలేకుండా చేసిన మహాత్మాగాంధీ భారతీయులకు ఎప్పటికీ చిరస్మరణీయులని కొనియాడారు. పరమేశ్వర మంగళం ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి రవినాయుడు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం



వడమాలపేట, అక్టోబరు 2: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. మండలం లోని ఎస్‌బీఆర్‌పురంలో సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. భవిష్యత్తులో పంచాయతీల్లో సర్పంచులకే పూర్తిస్థాయిలో అధికారం ఉంటుందని చెప్పారు. సర్పంచ్ మణిరాజు, పెద్దబ్బరాజు, సుకుమార్, ధనంజయులు నాయుడు, శ్యామయ్య, హరిరాజు, సూర్య, నారాయణరాజు, యయాతి, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ చొరవే గ్రామ స్వరాజ్యం



వడమాలపేట, అక్టోబర్ 2: మహాత్మా గాంధీ చొరవతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమైందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. పంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యదర్శి శ్రీలేఖ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. డిల్లీప్రసాద్, వెంకటయ్య, ఉమాపతి రావ్, శ్రీనివాసులు, శివ, వేణు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్షలు

● రోజుకు రెండు సెషన్లుగా 21వ తేదీ వరకు ● జిల్లాలో 37,610 మందికి 9 కేంద్రాలు



టెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ప్రసన్నకుమార్

తిరుపతి(విద్య), అక్టోబరు 2: ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగే టెట్ పరీక్షల కోసం జిల్లాలో 9 కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. 37,610 మంది అభ్యర్థులు టెట్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో 88 వికలాంగ అభ్యర్థులకు స్క్రైబ్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. అలాగే వారికి నిబంధనల ప్రకారం 50 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయించనున్నారు. టెట్ పరీక్షకు సంబంధించి అమరావతిలోని పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ డాక్టర్ ఎంఆర్ ప్రసన్న కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిశీలకులుగా నియమించింది. ఆయన బుధవారం జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి వసతులను పరిశీలించారు.

ఇవే పరీక్ష కేంద్రాలు..

పుత్తూరు శ్రీవెంకట పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి రేణిగుంట రోడ్డులోని చదలవాడ కృష్ణమూర్తి ఇంజినీరింగ్ కళాశాల, తిరుపతి - కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, చంద్రగిరి రామిరెడ్డిపల్లె అయాన్ డిజిటల్ జోన్, తిరుపతి చెర్లోపల్లిలోని అయాన్ డిజిటల్ జోన్, కోట విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల, గూడూరు దూర్జటిలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో టెట్ పరీక్షలు జరుగనున్నాయి.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి,అక్టోబరు 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది . మహాలయ అమావాస్య కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 848మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1,809మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,156మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 902, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 233మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 208మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 88మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 18,758 విక్రయించినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

సీఎం పర్యటన బందోబస్తు పక్కాగా ఉండాలి



తిరుపతి విమానాశ్రయంలో వివిధ శాఖ అధికారులతో సమీస్తున్న కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట, అక్టోబరు 2: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడానికి ఈ నెల 4, 5 తేదీల్లో సీఎం చంద్రబాబు జిల్లాకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు, బందోబస్తు విషయంలో చిన్న పాటి లోపాలకు తావు ఉండకూడదని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బ రాయుడు ఆదేశించారు. బుధవారం ఉదయం తిరుపతి విమానాశ్రయం వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం పర్యటించే అన్ని ప్రదేశాల్లో విధులు కేటాయించిన అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. మెడికల్ క్యాంపు, అంబులెన్సును జిల్లా వైద్యాధికారి సమన్వయం చేసుకోవాలన్నారు. సేఫ్టీ రూం, అధునాతన లైఫ్ సపోర్టు, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీకి ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. సీఎం తిరుమల, తిరుపతి పర్యటన కార్యక్రమం ముగింపు వరకు విధులు కేటాయించినవారు జాగ్రత్తగా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం భన్సల్, అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, నాగభూషణ్, ఆర్డీవో పెంచలకిషోర్, టీటీడీ విజిలెన్స్ అధికారులను తదితరులు పాల్గొన్నారు.



అస్పియా (ఫైల్ ఫొటో)

ఆరేళ్ల అస్పియాను చంపేశారు

● ఆదివారం అదృశ్యమైన చిన్నారి శవమై చెరువులో తేలింది

● కారణాలను అన్వేషిస్తున్నామన్న ఎస్పీ



బిడ్డ మృతదేహాన్ని చూసి రోదిస్తున్న అజ్మతుల్లా

పుంగనూరు, అక్టోబరు 2 : ఆదివారం రాత్రి ఇంటి ముందు ఆడుకుంటూ కన్పించకుండా పోయిన చిన్నారి అస్పియా(6) బుధవారం నాటికి చెరువులో శవమై తేలి కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచింది.నాలుగురోజులుగా 11పోలీసు బృందాలు గాలిస్తున్నా చిన్న క్లూ కూడా లభించని పరిస్థితుల్లో అస్పియా శవమై కన్పించడం అందరినీ దిగ్భ్రాంతికి లోనుచేసింది.అస్పియాను చంపేసి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో పడేశారనే విషయం బుధవారం ఉదయం 11గంటలకు దావానలంలా వ్యాపించగా వందల సంఖ్యలో శవాన్ని చూసేందుకు చెరువు వద్దకు చేరుకున్నారు.శవాన్ని చూసి కంటతడిపెట్టారు. ఇందుకు కారకులైన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. పుంగనూరు ఉబేదుల్లా కాంపౌండ్‌లోని వడ్డీ వ్యాపారి ఎస్.అజ్మతుల్లా, ఆసియా దంపతులకు కుమారుడు అశ్వక్ (13), కుమార్తె అస్పియా అంజుమ్(6) ఉన్నారు. ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో అస్పియా ఇంటి ఎదుట పిల్లలతో కలిసి ఆడుకుంటుండగా కొద్దిసేపు కరెంట్ పోయింది.అప్పట్నుంచీ అస్పియా కనిపించలేదు. చుట్టుపక్కల వీదుల్లో గాలించినా లాభం లేకపోవడంతో రాత్రి 10.30 గంటలకు సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు.ఈ విషయాన్ని ఎస్పీ మణికంఠ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన వెంటనే స్పందించారు. డీఎస్పీలు ప్రభాకర్, సాయినాథ్, ఇలియాస్ బాషా, మహబూబ్‌బాషా, సీఐలు భాస్కర్, శ్రీనివాసులు, ఉమామహేశ్వరరావు, ప్రసాద్, పలువురు ఎస్ఐలు, నేరవిభాగంలో నిష్ణాతులైన కొంతమందిని 11 బృందాలుగా ఏర్పాటు చేసి గాలింపు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో పుంగనూరు ఎన్ఎస్‌పేటలోని బావాజాన్ కుమారుడు అయాజ్ (4) ఇంటి వద్ద ఆడుకుంటుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి చాక్లెట్ ఇస్తామని పిలవడం అతడి తల్లిదండ్రులు గమనించారు. మీరెవరంటూ ప్రశ్నించబోగా వారు పరారయ్యారు.వెంటనే తెలిసిన వారికి ఫోన్లు చేసి మోటారు సైకిళ్లలో వెంబడించారు.వారికోసం వెతుకుతూ సమీపంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్దకు వెళ్లగా నీటిలో తేలుతున్న శవం కన్పించింది. వెంటనే పోలీసులకు చెప్పడంతో బాలిక తండ్రి అజ్మతుల్లాను అక్కడికి తీసుకొచ్చారు. శవాన్ని చూసి తన బిడ్డేనంటూ అజ్మతుల్లా రోదించాడు. ఈ విషయం తెలిసి వందలమంది అక్కడికి చేరుకున్నారు.స్థానికులే చెరువులోకి దిగి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చగా శవపరీక్ష కోసం పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు.ఎస్పీ మణికంఠ జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆస్పత్రి వద్దకు చేరుకుని కుటుంబీకులు, ముస్లిం మతపెద్దలతో చర్చించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనాచారి నేతృత్వంలో ఏడుగురు వైద్యుల బృందం పోస్టుమార్టం చేసి శరీరంలోని కొన్ని అవయవాలను నిల్వ చేసి తిరుపతి ల్యాబ్‌కు పంపారు. మృతదేహంపై ఎలాంటి గాయాలులేవని వైద్యులు తెలిపారు.ఆస్పత్రి నుంచి అస్పియా మృతదేహాన్ని వందలాదిమంది సమీపంలోని ఖబరస్తాన్ వద్దకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

పథకం ప్రకారమే చంపేశారా?

అస్పియా తండ్రి అజ్మతుల్లా వడ్డీ వ్యాపారం చేస్తుండడం వల్ల వ్యాపారలావాదేవీల్లో గొడవలు, ఇతర కారణాలతో చిన్నారిని కిడ్నాప్ చేసి చంపేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడా కూడా సీసీ కెమెరాలకు చిక్కకుండా, ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త పడ్డారంటే పథకం ప్రకారమే చంపేశారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.పుంగనూరులో విచ్చలవిడిగా గంజాయి, సారా, కర్ణాటక మద్యం లభిస్తుండడంతో ఆ మత్తులో ఆకతాయిలు ఇలా చేశారా, లేక బిడ్డను కిడ్నాప్ చేసి తండ్రి నుంచి డబ్బులాగాలని అఘాయిత్యానికి పాల్పడ్డారా అనే అనుమానాలను మరికొందరు వ్యక్తపరుస్తున్నారు.ఈ విషయమై ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ అస్పియా మృతిపై కారణాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. మృతురాలి శరీరభాగాలను సేకరించి తిరుపతి ల్యాబ్‌కు పంపామని, అక్కడి నుంచి రిపోర్టు రావడానికి 2వారాల సమయం పడుతుంది అని చెప్పారు.

పుత్తూరు వార్తలు

గ్రామ స్వరాజ్యం టీడీపీతోనే సాధ్యం



పారిశుధ్య కార్యక్రమంలో ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, అక్టోబర్ 2: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ తెలిపారు. బుధ వారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే మున్సిపల్ కార్మికులతో కలిసి స్వచ్ఛతా హీ సేవలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వ హించి, అంబేద్కర్ సర్కిల్ వద్ద రోడ్డును శుభ్రపరిచారు. అనంతరం మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మాజీ ఎంపీపీ డీఎన్. ఎలుమలై, టీడీపీ పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, కార్యదర్శి ఎన్.ఎన్. ధనపాల్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రావిళ్ల మాధవనాయుడు, నాయకులు బాబునాయుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, కేశావచారి, రఫీ, ఆనంద్, కోలా ఆనంద్, వేలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



పుత్తూరు అర్బన్, అక్టోబరు 2: పుత్తూరు ఎక్సైజ్ శాఖ సీఐగా బాధ్యతలు స్వీకరించిన మురళీమోహన్ బుధవారం ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి సత్కరించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు ● నాటు తుపాకీ స్వాధీనం



పట్టుబడ్డ స్మగర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

కేవీబీపురం, అక్టోబరు 2: మండలంలోని అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎర్రచందనం దుంగలతోపాటు ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ ఎం.చిరంజీవులు, ఆర్ఎస్ఐ ఎం.మురళీదర్‌రెడ్డి బృందం సోమవారం అర్ధరాత్రి పచారుమాను వద్ద కూంబింగ్ నిర్వహించారు. కొంతమంది ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసుల కంట బడ్డారు. అప్రమత్తమైన సిబ్బంది వారిని చుట్టుముట్టేలోగా స్మగ్లర్లు దుంగలను వదలి పారిపోయారు. వారిలో ఇద్దరిని పట్టుకో గలిగారు. స్మగ్లర్లు వదలి వెళ్లిన 63 దుంగలు సహా అటవీ జంతువులను వేటాడే నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్ రఫి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరవ కాలువ ఆక్రమణలు తొలగించండి



సమావేశంలో మాట్లాడుతున్న శివయ్య

ఏర్పేడు, అక్టోబరు 2: ఆక్రమణల నుంచి ఏర్పేడు చెరువు వరవ కాలువను కాపాడాలని గ్రామసభలో స్థానికులు కోరారు. గాంధీ జయంతి సందర్భంగా సర్పంచ్ శివయ్య అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో స్థానికులు మాట్లాడుతూ... వరవ కాలువ ఆక్రమణ కారణంగా ఏర్పేడు చెరువునిండితే యాదవవీధి, కమ్మవీధి, అశోక్‌నగర్, కాపువీధి జలమయమవుతున్నాయని చెప్పారు. వార్డు సభ్యులు తిరుమలయ్య, డిష్ కృష్ణయ్య, సీపీఎం నా యకురాలు గురవమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

మోదుగులపాళెంలో...

మోదుగులపాళెం పంచాయతీలో బుధవారం జరిగిన గ్రామసభను డిజిటల్ అసిస్టెంట్ దామోదర్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ హరి బహిష్కరించి అక్కడి నుంచి వెళ్లిపోయారని సర్పంచ్ జయరామయ్య తెలిపారు. సచివాలయ సిబ్బంది సకాలంలో తమకు పింఛన్లు అందివ్వడం లేదని లబ్ధిదారులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై వారిద్దరు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులపై తిరగబడి గ్రామసభను బహిష్కరించారు. దీనిపై కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ తెలిపారు.

క్రీడలతోనే శారీరక దృఢత్వం



విజేతలతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, అక్టోబరు 2: క్రీడలతోనే శారీరక దృఢత్వం సాధించవచ్చని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఐఐటీ ప్రాంగణంలో సెప్టెంబరు 28 నుంచి 2వ తేదీ వరకు సంయోగ్ టోర్నమెంట్ నిర్వహించారు. తిరుపతి పరిసర ప్రాంతాల నుంచి 13 ప్రతిష్ఠాత్మకమైన కళాశాలల నుంచి 700 మంది అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో విజేతగా నిలిచిన పలు కళాశాలల క్రీడాకారులకు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అవార్డులను ప్రదానం చేశారు. క్రికెట్ విజేతగా ఎస్వీసీఈ ఇంజనీరింగ్ కళాశాల నిలిచింది. ఓవరాల్ అథ్లెటిక్స్ విజేతగా ఎంజీ యూనివర్శిటీతకి చెందిన రాజారెడ్డి నిలిచారు. బాలికల అథ్లెటిక్స్ విజేతగా రూప విజేతగా నిలిచింది.

రాష్ట్రస్థాయి క్రీడల్లో సత్తా చాటండి



రేణిగుంట, అక్టోబరు 2: రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటాలని డీఈవో శేఖర్ అన్నారు. ఈ నెల 3, 5 తేదీల్లో కృష్ణా జిల్లా నున్న జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-14 రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన రేణిగుంట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు జెర్సీలను ఆయన అందజేశారు. పీటీ మాస్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాడవాడలా గాంధీ జయంతి వేడుకలు



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ - రేణిగుంట రైల్వేస్టేషన్ వద్ద గాంధీజీ దంపతుల విగ్రహానికి నివాళులు

శ్రీకాళహస్తిలో గాంధీ విగ్రహ పునః స్థాపన

నివాళులర్పించిన ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, అక్టోబరు 2: ముక్కంటి ఆలయ సమీపంలోని రాజగోపురం వద్ద గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పునఃస్థాపన చేశారు. రాజగోపురం వద్ద దశాబ్దాలుగా గాంధీ విగ్రహం ఉండేది. ఈ యేడాది జనవరిలో గత వైసీపీ పాలకులు, అధికారులు ముక్కంటి ఆలయ వాహన మండపం నిర్మాణానికి విగ్రహం అడ్డుగా ఉందన్న సాకుతో తొలగించారు. దీనిపై ప్రజలనుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ పట్టించుకోలేదు. రాజగోపురం సమీపంలో గాంధీ విగ్రహాన్ని తిరిగి పునఃస్థాపన చేస్తామని ఎన్నికల ప్రచారంలో బొజ్జల సుధీర్‌రెడ్డి స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని విగ్రహాన్ని రాజగోపురం వద్ద తిరిగి ప్రారంభించారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలకులు కనీస నిబంధనలు పాటించకుండా జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని తొలగించడం బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. నగరివీధిలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. రమేష్‌బాబు, జి.రమేష్‌బాబు, ప్రసాద్, మురళికృష్ణ, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీఎంవీ కండ్రిగలో ఏపీ బీసీసంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుక జరిగింది.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని సచివాలయంలో జాతిపిత మహాత్మగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీవో త్రివిక్రమరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఇందిరమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని తిమ్మసముద్రంలో గాంధీ జయంతి సందర్భంగా సర్పంచ్ దొరబాబునాయుడు, కార్యదర్శి అమ్ములు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కేవీబీపురంలోని పీడీఆర్ భారత్‌గ్యాస్ యాజమాని ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పాతపాళెం సర్పంచ్ లత, ఆనంద్‌రెడ్డి, గోపి, రాజు, షేక్ బాషా, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండల వ్యాప్తంగా గాంధీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వీట్లు పంపిణీ చేశారు.

ఏర్పేడు: గాంధీ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, నిరంజన్, కటారి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: అహింసా మార్గంలో నడిచి అందరికి ఆదర్శంగా నిలిచిన జాతిపిత మహాత్మగాంధీ తత్వాన్ని ఆచరిద్దామని రిటైర్డ్ హెచ్ఎం నాగయ్య పిలుపునిచ్చారు. 1993 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలు పిచ్చాటూరు గాంధీ నగర్‌లో ఘనంగా నిర్వహించారు.

సత్యవేడు: గాంధీ జయంతి వేడుకలను సత్యవేడులో ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో చంద్రశేఖర్, సర్పంచు మంజుల, కార్యదర్శి మునిరవికుమార్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో బీసీ కాలనీ, గవర్నమెంట్ స్కూల్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, అక్టోబరు 2: పట్టణంలోని పీవీరోడ్డులో కొలువై ఉన్న అంకాలమ్మ ఆలయం వద్ద బుధవారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. మూడు సంవత్సరాలుగా ప్రతి అమ్మవాస్య సందర్భంగా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, కాంత్రికుమార్, శివకుమార్‌రెడ్డి, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ చందన స్రవంతికి సన్మానం

శ్రీకాళహస్తి, అక్టోబరు 2: ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ చందన స్రవంతిని బుధవారం పట్టణంలోని ఎంజీఎం హోటల్‌లో ఘనంగా సన్మానించారు. ఎంజీఎం అధినేత గుద్లూరు మయూర్ మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జె.గురవయ్య, పి.మధు, పి.రవి, కె.విజయకుమార్, జి.మురళి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈ బాధ్యతల స్వీకారం



వరదయ్యపాళెం, అక్టోబరు 2: మండల ట్రాన్స్‌కో ఏఈగా విజయ్ వెంకటేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై స్పందించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 2: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద నిరసన తెలిపారు. సూపర్‌సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రధాన సమస్యలను పట్టించుకోవడం లేదని చెప్పారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, శ్రీరాములు, గోపి, శివకుమార్, వైఎస్ మణి, కత్తి రవి, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



శ్రీకాళహస్తి, అక్టోబరు 2: మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు సభ్యులు పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఎస్వీయే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, జీఎంఆర్, షాకీరాలీ, మోహన్, శేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 2: తొట్టంబేడు మండలంలోని రౌతుసూరమాలలో కొలువై ఉన్న సిద్ధరాజ దత్తాత్రేయస్వామికి మహాలయ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

గుంతల పూడ్చివేత



గోవర్ధనపురం వద్ద జరుగుతున్న పనులు

వరదయ్యపాళెం, అక్టోబరు 2: మండలంలోని గోవర్ధనపురం వంతెనపై ఉన్న గుంతలను జనసేన నాయకుడు చిట్టిబోయిన జానకిరామయ్య తన సొంత నిధులతో పూడ్పించారు. గుంతల కారణంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతుండడంతో చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. సర్పంచ్ జ్యోతి, టి.శ్రీనివాసులు, దొడ్డి శేఖర్, విజయ్‌కుమార్, శేఖర్, త్యాగరాజు, పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి, పోలీసు సిబ్బంది సాయిబాబా, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛతా హీ సేవ



రేణిగుంట, అక్టోబరు 2: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మండలంలో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. కేఎల్ఎం ఆస్పత్రి కూడలిలో ఖాళీ ప్లాస్టిక్ వాటర్‌బాటిళ్లతో నిర్మించిన బస్ షెల్టర్‌ను డీపీవో సుశీలాదేవి పరిశీలించారు.

ముక్కంటి సేవలో హరిద్వార్ శివసేన అఖాడా పీఠాధిపతులు



శ్రీకాళహస్తి, అక్టోబరు 2: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం హరిద్వార్ శివసేన అఖాడా పీఠాధిపతులు సూర్యచందేశ్వరస్వామి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హరిద్వార్ పీఠాధిపతి శిష్య బృందం, హిందూ ధర్మ ప్రచార మండలి సభ్యులు పి.రాజకుమార్, పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 2: నిత్య యోగాతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం వస్తుందని యోగా గురువు సురేష్‌నాయుడు తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్వీఆర్ విద్యా సంస్థలో నేచురోపతి డేను పురస్కరించుకుని బుధవారం విద్యార్థులకు ఆసనాలను నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేస్తే బీపీ, షుగర్, దీర్ఘకాలిక రోగాలు అదుపులో ఉంటాయని తెలిపారు.

వైద్య శిబిరం

కేవీబీపురం, అక్టోబరు 2: మండలకేంద్రంలో చాగణం డయోగ్నిస్టిక్ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు బీపీ, షుగర్ రక్తపరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉచితం అనేసరికి చిన్నా పెద్ద తేడా లేకుండా ఎక్కువమంది ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు.

వైభవంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, అక్టోబరు 2: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం అమావాస్య ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడికి పలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి పురవిహారం చేశారు. వీధుల్లో విహరిస్తున్న స్వామిఅమ్మవార్లకు భక్తులు కర్పూరనీరాజనాలు సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

ముస్తాబైన కనకాచలం



కనకాచలం కొండకు విద్యుద్దీపాలంకరణ

శ్రీకాళహస్తి, అక్టోబరు 2: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం బుధవారం విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా ముస్తాబైంది. విద్యుత్ అలంకరణలు భక్తులకు ఆకట్టుకుంటున్నాయి. ఇక ఆలయంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లును అధికారులు చేస్తున్నారు.

నేటినుంచి గుడిమల్లంలో దసరా ఉత్సవాలు



ఎమ్మెల్యే బొజ్జలను సన్మానించి ఆహ్వానపత్రిక అందిస్తున్న గిరినాయుడు

ఏర్పేడు, అక్టోబరు 2: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వ రాలయంలో బుధవారం నుంచి 11వ తేదీ వరకు దసరా ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆహ్వానించినట్లు ఆలయ మాజీ చైర్మన్ గిరి నాయుడు తెలిపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేను ఊరందూరులో మర్యాదపూర్వకంగా నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. పద్మనాభనాయుడు, రాజశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నా రు. అదే విధంగా చిందేపల్లిలో పార్వతి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో కూడా దసరా వేడుకలను 11వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
O.S. No. 31 of 2023 and in I.A. No. 280 of 2023
D Leelakrishnama Naidu ...Plaintiff/Petitioner
Vs.
M Dinakar ...Defendant/Respondent
To,
M Dinakar S/o Late M Krishnama Naidu, Seetharamapuram Village and post Vadamalapeta mandal, Tirupati district.
Notice To Defendant / Respondent
Please take Notice that the above suit and I.A. is posted to **14-10-2024** for your appearance either in person or through your advocate. Failing which the above suit and I. A. will be decided exparte.
(By the order of the Court)
MATTA PURUSHOTHAM REDDY
Advocate for Plaintiff/Petitioner

అర్హులందరికీ పథకాలు



మాట్లాడుతున్న గాలి మురళీనాయుడు

శ్రీకాళహస్తి, అక్టోబరు 2: తొట్టంబేడు మండలం దిగువ కొణతనేరిలో సర్పంచ్ గాలి బాలాజీనాయుడు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు మాట్లాడుతూ... అర్హులందరికీ ఉపాధి హామీ జాబ్‌కార్డులు, పింఛన్లు, రేషన్‌కార్డులు అందిస్తామన్నారు. ఎంపీటీసీ కాంతమ్మ, సచివాలయ సిబ్బంది, పలుశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎంజీఎం సేవలు అభినందనీయం



శ్రీకాళహస్తి, అక్టోబరు 2: ఎంజీఎం ఆస్పత్రి ఉచిత సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గాంధీవీధిలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ నాయకులు విజయకుమార్, కంఠా రమేస్, కాసరం రమేష్, ఉమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో బోరు ప్రారంభం



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 2: మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలోని శ్మశానంలో పంచాయతీ నిధులతో బుధవారం కొత్త బోరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ మాట్లాడుతూ... శ్మశానంలో కర్మక్రియలు జరిగేటప్పుడు నీరు లేక ఇబ్బందులు పడుతుండటంతో బోరు ఏర్పాటు చేశామన్నారు. బోరును ఉప సర్పంచు మునిరాజా ప్రారంభించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

పాస్‌పోర్ట్ దారిపోయినది
తిరుపతి జిల్లా తిరుపతి అర్బన్ మండలం, ఎం.ఆర్.పల్లి సర్కిల్ దగ్గర, న్యూ బాలాజీ కాలనీ, డి. నెం. 8-172, ఫ్లాట్ నెం.187లో కాపురముండు లేట్ ఎ. నరసింహులు నాయుడు గారి కుమారుడు ఎ.సౌందర్ నాయుడు (నా యొక్క) Passport No.U1740743 and VISA No.M6531637 తేది: 26-07-2024 కారులో తిరుపతి నుండి వెళుతుండగా ఎం.ఆర్. పల్లి సర్కిల్ వద్ద దారిపోయినది. ఆచూకి తెలిసిన వారు దిగువ ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు. సంప్రదించండి: 9393640508.
AJT - 10837

CHANGE OF NAME
I, Sapala Sreeramulu (Old Name), R/o: 12/83, Mandaram, Mannur, Rajampet, Annamayya Dt, A.P. Do here by declared I have changed my surname as Chapala Sreeramulu (New Name) S/o Chapala Lakshumaiah.
AJT - 4343

LAND FOR LEASE
వ్యవసాయం భూమి లీజుకు కావలెను. 5 ఎకరాల నుండి 10 ఎకరాల వరకు. తిరుపతి నుండి 10 నుండి 15 కి.మీ. లోపు. సంప్ర. : 91777 27987.
AJT - 200553

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బులో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రదించు 7382114647
AJA- 198089

కామాఖ్య రైల్ యాత్ర
కలకత్తా, కామాఖ్య, వైద్యనాద్, గయా తేది: 15-02-25. 12 రోజులు టికెట్ 1కి 22,000/- (రైలు, A/C బస్సు, A/C రూం+ భోజనం) కె.వాసు, నెల్లూరు. సం.ప్ర. సెల్: 94913 40504
AJR-193920

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

శ్రీ ద్రౌపది దేవి సమేత
శ్రీ ధర్మరాజుల స్వామి వారి దేవస్థానము
పుత్తూరు, తిరుపతి జిల్లా, (ఆం.ప్ర)
శ్రీ దేవి దసరా నవరాత్రి మహోత్సవ ఆహ్వానము
తిరుపతి జిల్లా, పుత్తూరులో వెలసియుండు శ్రీ ద్రౌపదీ దేవి సమేత శ్రీ ధర్మరాజు స్వామి వారి విజయదశమి దసరా పర్వదినాలు 03.10.2024వ తేది గురువారం నుండి 12.10.2024 శనివారం వరకు శరన్నవరాత్రి మహోత్సవములు అత్యంత వైభవంగా జరుగును. కావున భక్తులందరూ విచ్చేసి అమ్మవారి కృపాకటాక్షములు పొందగలరని ప్రార్థన.
శ్రీ గాలి భానుప్రకాష్ గారు ఎమ్మెల్యే, నగరి
కార్యక్రమాలు:
03.10.2024 గురువారం - ఉ॥ అభిషేకము- పూజ, సా॥ శ్రీ ఆదిపరాశక్తి జగన్మాత అలంకరణ
04.10.2024 శుక్రవారము- ఉ॥ అభిషేకము- పూజ, సా॥ శ్రీ గజలక్ష్మి అలంకరణ
05.10.2024 శనివారం - ఉ॥ అభిషేకము- పూజ, సా॥ శ్రీ మీనాక్షీదేవి అలంకరణ
06.10.2024 ఆదివారం- ఉ॥ అభిషేకము- పూజ, సా॥ శ్రీ ధనలక్ష్మి అలంకరణ
07.10.2024 సోమవారం -ఉ॥ అభిషేకము- పూజ, సా॥ శ్రీ అన్నపూర్ణదేవి అలంకరణ
08.10.2024 మంగళవారం -ఉ॥ అభిషేకము- పూజ, సా॥ శ్రీ పార్వతీదేవి అలంకరణ
09.10.2024 బుధవారం : ఉ॥ అభిషేకము- పూజ, సా॥ శ్రీ సరస్వతీ దేవి అలంకరణ
10.10.2024 గురువారం :ఉ॥ అభిషేకము- పూజ, సా॥ శ్రీ కామాక్షి అలంకరణ
11.10.2024 శుక్రవారం:ఉ॥ అభిషేకము- పూజ, సా॥ శ్రీ మహిషాసురమర్దిని దేవి అలంకరణ
12.10.2024 శనివారం :మ॥12 గం॥ అమ్మవారికి షడ్రసోపేతమైన అన్న నైవేద్య నివేదన, భక్తులకు అన్నదానం
ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
బి.ఆర్. యుగంధర్ మాజీ చైర్మన్., పుత్తూరు పురపాలక సంఘం పుత్తూరు
సొక్కాకం కిష్టప్ప మొదలి., కోవిల్ కార్ శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజ స్వామి వారి దేవస్థానం., పుత్తూరు